www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 6 ఏప్రిల్ 2025

5

వైఎస్ఆర్

ఆకట్టుకున్న వైవీయూ స్టాల్స్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల వద్ద 'అమరావతి చిత్రకళ వీధి' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ఆర్ట్స్ శాఖ ఏర్పాటు చేసిన చిత్రకళ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, రాజమండ్రి ఎమ్మెల్యే వాసు, ప్రోగ్రాం ఇన్‌ఛార్జ్ తేజస్వి ప్రతిష్టాల వద్దకు వచ్చి వర్కులను వీక్షించారు. ఈ సందర్భంగా వైవీయూ స్టాల్స్‌ను సందర్శించి అద్భుతమైన చిత్రకళ అంటూ ప్రశంసించారు. వైవీయూ నుంచి ఆరు స్టాల్స్ ఏర్పాటు చేశామని ఫైన్ ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డా.కె. మృత్యుంజయరావు తెలిపారు. అధ్యాపకులు వెంకటేష్ వీరప్ప, విద్యార్థులు ముత్యం పునీత్ బలరాం, సింహాద్రి, దేవదాసు పాల్గొని స్టాల్స్‌లోని చిత్రాల గురించి వీక్షకులకు వివరించారని తెలిపారు. కార్యక్రమంలో దాదాపుగా 500 స్టాల్స్, వెయ్యి మందికి పైగా ఆర్టిస్టులు హాజరయ్యారని చెప్పారు.

సర్దుబాటు పేరుతో ఊరు బడికి ఎసరు..!

పాఠశాలల విలీనంపై తల్లిదండ్రుల్లో వ్యతిరేకత

సరస్వతి పాఠశాల నుంచి 3, 4, 5వ తరగతుల విద్యార్థులను తరలించనున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల మూసివేత వైపే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామ బడులను సర్కారు విలీనం వైపు నడిపిస్తోంది. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించకపోయినా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు నో అని చెప్పిన విలీన ప్రక్రియను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒకమోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటులో భాగంగా తక్కువ ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలలోని విద్యార్థులను ఒక్క చోటకు చేర్చే ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలో దూరం వెళుతున్న విద్యార్థులకు రవాణా ఛార్జీలను ఇస్తామని ప్రభుత్వం మభ్య పెడుతోంది. గత ప్రభుత్వం చివరి ఏడాది అమ్మ ఒడి, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలలు గడుస్తున్నా తల్లికి వందనాలను అమలు చేయలేకపోయిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. గత ప్రభుత్వం జీవో నం.117 తీసుకొచ్చి పాఠశాలలను విచ్ఛిన్నం చేసింది. అది మరిచిపోక ముందే 3,4,5 తరగతుల విలీనానికి నూతన ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గత ప్రభుత్వంలో 3,4,5 తరగతులను హైస్కూల్లో విలీనం చేస్తే ఈ ప్రభుత్వం మాడల్ పాఠశాల పేరుతో గ్రామ సమీపంలోని పాఠశాలలో విలీనానికి చర్యలు చేపట్టింది. రెండు విధానాలకు పెద్ద తేడా ఏమీ కనిపించడం లేదు. గ్రామాలలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎంతగానో ఉపయోగపడే పాఠశాలల విలీనానికి తల్లిదండ్రులు గ్రామస్తులు సముకుత చూపడం లేదు. కడప జిల్లాలో 2వేలు ప్రాథమిక పాఠశాలలున్నాయి ప్రతి మండలంలో 10 నుంచి 15 మోడల్ పాఠశాలలను ఎంపిక చేసి ఈ పాఠశాలలకు 3-5 కిలోమీటర్ల లోపు ఉన్న పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల విద్యార్థులను విలీనం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది దీంతో రాబోయే రోజుల్లో 300 నుంచి 500 పాఠశాలల్లో మూతపడే అవకాశం ఉంటుంది. 3,4,5 తరగతుల విద్యార్థులు చాలా మంది బడి మానివేసే ప్రమాదం ఉంది.

సర్దుబాటు పేరుతో ఊరు బడి కనుమరుగే..

నూతన విద్యా విధానంలో సంస్కరణల కారణంగా విద్యా వ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు మాడల్ పాఠశాలల పేరుతో 3,4,5 తరగతులను విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలను వ్యతిరేకించే పాఠశాల విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉన్నతాధికారులు పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఉదాహరణకు చాపాడు మండల పరిధిలో ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదన మేరకు 10 మాడల్ పాఠశాలలను సిద్ధం చేశారు. అన్నవరం, చియ్యపాడు, మొత్రాయపల్లె, చాపాడు, పల్లవోలు, పల్లవోలు హరిజనవాడ, ఖాదర్ పల్లె, లక్ష్మీపేట, నక్కలదిన్నె, వి రాజుపాలెం గ్రామాలలోని పాఠశాలలను మాడల్ పాఠశాలలగా ఎంపిక చేశారు. ఈ పాఠశా లలకు 3 కి.మీ పరిధిలోని పాఠశాలలోని 3,4,5 తరగతులను విలీనం చేసే ఏర్పాట్లు చేపట్టే ఏర్పాట్లు చేస్తున్నారు. తిప్పిరెడ్డిపల్లె పాఠశాల విద్యార్థులను రాజుపాలెం పాఠశాలలో విలీనం చేసేందుకు తల్లిదండ్రులు ఒప్పదం తెలిపారు. మిగిలిన గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నారు.

విలీనంతో పలు సమస్యలు..

3, 4, 5వ తరగతులను సమీపంలోని పాఠశాలలో విలీనం చేయడం కొన్ని గ్రామాలలో పెద్ద సమస్యగా కనిపించకపోవచ్చు. వంకలు, చెరువులు, ప్రధాన రహదారులు, రోడ్డు దాటే గ్రామాలు ఉన్న చోట పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పది సంవత్స రాల లోపు పిల్లలు కావడంతో విష పురుగులు, వాహనాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఉదా హరణకు మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతిపేట పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలోని పాఠశాలలో చదివే 3,4,5 తరగతి విద్యార్థులను మైదకూరు పట్టణంలోని కడప రోడ్డులో గల మసీదు సమీపంలోని పాఠశాలలో కలిపేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ గ్రామం నుంచి కడప మైదుకూరు ప్రధాన రహదారిపై విద్యార్థులు మైదుకూరు పట్టణానికి రావాల్సి ఉంటుంది. ఈ మార్గాన నిత్యం వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో ఈ పాఠశాలకు విద్యార్థులను పంపేందుకు తల్లిదండ్రులు ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఇలా జిల్లాలో పలు గ్రామాలలో విలీనానికి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. విద్యార్థులు పాఠశాలలకు దూరం కావడం కానీ, ప్రయివేట్ పాఠశాలను ఆశ్రయించడం కానీ జరిగే అవకాశం ఉంది. వీటిపై అధికారులు మాట్లాడుతూ ఇవన్నీ ప్రతిపాదనలు మాత్రమేనని తుదిరూపం వచ్చేసరికి మార్పులు, సర్దుబాట్లు జరుగుతాయని అంటున్నారు.

గ్రామంలోని పాఠశాలలోనే వసతులు కల్పించాలి

విద్యార్థులను పక్క గ్రామంలోని పాఠశాలకు పంపితే అన్ని రకాల వసతులు అందుబాటులో ఉంటాయని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. గ్రామంలోని పాఠశాల లోనే ఆ వసతులు కల్పిస్తే మా పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇతర గ్రామం లోని పాఠశాలకు విద్యార్థులను పంపాలంటే పలు సమస్యలు ఎదురవుతాయి. ప్రతిరోజు పిల్లలు నడుచుకుంటూ రెండు కిలోమీటర్లు వెళ్లాలంటే కష్టతరం అవుతుంది. ప్రధాన రహదారిలో వాహనాలు, విషయ పురుగులతో ఇబ్బందిగా ఉంటుంది. గ్రామంలోని పాఠశాలలో వసతులు మెరుగుపరచాలి.

- పద్మావతి, విద్యార్థి తల్లి, సిద్దారెడ్డిపల్లె, చాపాడు.

పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలి

ప్రస్తుతం ఉపాధ్యాయులు పాఠశాలకు పిలిపించి తమ పిల్లలను మైదుకూరు పట్టణంలోని పాఠశాలకు పంపాలని సూచిస్తున్నారు. మైదుకూరుకు పిల్లలను పంపే వసతి ఉంటే ప్రయివేట్ పాఠశాలల్లో చదివించుకునేవాళ్లం. ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాం. గ్రామంలోనే పాఠశాలను కొనసాగించాలి. ప్రభుత్వం విలీన ప్రక్రియను మానుకోవాలి.

- కృష్ణవేణి, విద్యార్థుల తల్లి సరస్వతిపేట, మైదుకూరు.

విలీనం వల్ల డ్రాపౌట్లు పెరిగే ప్రమాదం ఉంది

3,5 కిలో మీటర్ల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను వేరుచేసి నూతనంగా ఏర్పాటు చేయబోయే ఆదర్శపాఠశాలల్లో విలీనం చేయడం వల్ల బడుగు, బలహీన,పేద వర్గాలకు చెందిన పిల్లలు దూరప్రాంతాలలో ఏర్పాటు చేసే ఆదర్శ పాఠశాలలకు వెళ్ళలేక డ్రాపౌట్లుగా మారిపోయే ప్రమాదం ఉంది. 45 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శపాఠశాలలుగా మార్చి వాటిలో తరగతికి ఒక టీచరును ఏర్పాటు చేయాలి. మిగిలిన ప్రాథమిక పాఠశాలలలో 1నుంచి 5 తరగతులను కొనసాగిస్తూ బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగా కొనసాగించాలి. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించి సబ్జెక్టు టీచర్లను నియమించాలి. విద్యాశాఖ ఉన్నతాధికారుల మాటలకు క్షేత్రస్థాయిలో భిన్నంగా ఉంది.

- వై.రవికుమార్, యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- నేడు ధ్వజారోహణం
- 11న శ్రీసీతారాముల కల్యాణం
- ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి జెఇఒ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం ఆరు నుండి 8 గంటల వరకు వేదపండితులు, అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. బాజాభజంత్రీలు నడుమ వేదపండితుల మంత్రోచ్ఛరణలతో అంకురార్పణం చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు హారతి ఇచ్చారు. కేరళ వాయిద్యకారులు ప్రదర్శన పలువురిని ఆకట్టుకొంది. బ్రహోత్సవాలలో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, సెల్వం, శివప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

రేపు ధ్వజారోహణం

ఈ నెల 6న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 9.30 నుంచి 11.15 గంటలకు వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఉంటుంది. ఆ తర్వాత పోతన జయంతి, కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేష వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిస్తారు.

11న శ్రీసీతారాముల కల్యాణం

ఏప్రిల్ 11వ తేదీన రాత్రి 6.30 నుంచి 8.30 గంటల వరకు సీతా రాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం గజ వాహనసేవ నిర్వహిస్తారు. 12న రథోత్సవం నిర్వహిస్తారు. 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావ రోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 15న సాయంత్రం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు : జెఇఒ

ఒంటిమిట్ట ఏకశిలానగరంలో 11న జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేశామని టిటిడి జెఇఒ వి.వీర బ్రహ్మం అన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఒంటిమిట్టలోని టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు పటిష్ట ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 120 గ్యాలరీలలో ఉండే భక్తులతో పాటు, కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవం తిలకించేలా 15 ఎల్ఇడీ స్క్రీన్‌లు, ఆలయం, కల్యాణ వేదిక, తదితర ప్రాంతాల్లో విద్యుత్ కాంతులతో 38 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు సులువుగా గుర్తించేదెలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో 100 సిసి కెమెరాలు, 3 డ్రోన్‌లు, 3 కంట్రోల్ రూమ్‌లు, దాదాపు 2400 మంది భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు దాదాపు 3 లక్షల తాగునీరు బాటిల్స్, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 13 మెడికల్ టీంలు, 8 అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ, పోలీసులు, టిటిడి అధికారులతో కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఏర్పాట్లను జెఇఒ పరిశీలించారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఎర్విన్, టిటిడి సిఇ టివి.సత్యనారాయణ, ఎస్ఇ ఎలక్ట్రికల్ వేంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి కెఎల్ఎన్ శాస్త్రి, రవాణా శాఖ జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఇఒలు నటేష్ బాబు, ప్రశాంతి, సెల్వం, శివప్రసాద్, ఎస్టేట్ అధికారి గుణ భూషణ్‌రెడ్డి, డిపిపి కార్యదర్శి శ్రీరాం రఘునాథ్ పాల్గొన్నారు.

అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు విశేష స్పందన

పరీక్షలు రాస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - కడప

కడప బార్ అసోసియేషన్ హాలులో శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షకు 40 మంది యువ న్యాయవాదులు హాజరై మోడల్ పరీక్షను రాశారు. అందులో మొదటి పదిమందిలో ఎనిమిది మంది మహిళలు అధిక మార్కులు సాధించారని భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ ప్రకటించారు. మోడల్ పరీక్ష ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు జరిగింది. మోడల్ ప్రశ్న పత్రాన్ని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షులు ఉమాదేవి విడుదల చేశారు. 100 ప్రశ్నలతో కూడిన మల్టిపుల్ ఛాయిస్ ప్రకారం మోడల్ పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులు పరీక్ష రాయడం పూర్తికాగానే కీని విడుదల చేసి సరి చూసుకోగా షేక్ ముస్తఫా 86, సి.రాజ్యలక్ష్మి 84, ఎ.రాహుల్ 80 మార్కులతో టాపర్స్‌గా నిలిచారు. మొదటి పదిమందిలో ఎనిమిది మంది మహిళా న్యాయవాదులు అధిక మార్కులు సాధించిన వారిలో ఉన్నారని వారు ప్రకటించారు. కార్యక్రమంలో ఐఎఎల్ న్యాయవాదులు నాగ సుబ్బారెడ్డి వెంకటేశ్వర రెడ్డి , వెంకట శివ,ట్రెజరర్ సురేష్ స్పోర్ట్స్ సెక్రటరీ చిన్నయ్య పాల్గొన్నారు.

గౌస్ నగర్‌లో బోర్లను మరమ్మతు చేయండి

ప్రజాశక్తి- కడప అర్బన్ : గౌస్ నగర్‌లో ఉన్న బోర్లను మరమ్మతు చేయాలని జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా కోరారు. శనివారం నగరంలోని ద్వారక నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్.మాధవి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ గౌస్ నగర్‌లో నీటి కొరత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్, మేలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, ముందస్తుగా మంచినీటి బోర్లను మరమ్మతు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ బోర్లు మరమ్మతు చేసి నీటి కొరత లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

నిరాశే!

ప్రజాదృష్టి

కరువు మండలాల ప్రకటన నిరాశను కలిగించింది. ఈ ఏడాది ఖరీఫ్ మొదలుకుని రబీ సీజన్ వరకు వరుస కరువు పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కడప జిల్లాలో 10 మండలాలకు పరిమితం కావడం ఆందోళన కలిగించింది. 2024-25 ఖరీఫ్ సీజన్ నుంచి చక్రాయపేట మండలం తాగునీటి ఎద్దడితో కటకటలాడుతోంది. కరువు మండలాల జాబితలో లేకపోవడం విస్మయాన్ని కలిగించింది. పలుమార్లు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చక్రాయపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. తాజాగా ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లా పశ్చిమ ప్రాంత మండలాలకు చోటు కల్పించే అవకాశాల్ని పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2025 ఖరీప్ సీజన్‌లో అన్నమయ్య జిల్లాలో 22 మండలాలకుపైగా కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ 19 మండలాలకు పరిమితం చేయడం తెలిసిందే. రబీ సీజన్‌లో కరువు మండలాల ప్రస్తావనే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కరువు మండలాల ఎంపిక సంబంధించిన ఏడు నుంచి తొమ్మిది పారామీటర్లలో ఏవో కొన్ని సాంకేతిక కారణాలతో మిగిలిన పారామీటర్లను అందుకోలేదనే పేరిట నిర్లక్ష్యం చేయడం ఆందోళనకరం. జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలంలో ఏర్పాటు చేసిన దాల్మియా సిమెంట్ కర్మాగారం విస్తరణకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ చర్చనీయాంశంగా మారింది. దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్నకొమ్మెర్ల ప్రభావిత గ్రామాల్లో దుగ్గనపల్లి పరిహారం చెల్లింపులకు పరిశీలన చేయడం తగదు. నవాబ్‌పేట గ్రామంలో ఇళ్లు, ప్రార్థనా మందిరాలు పగుళ్ల బారిన పడిన సంగతి తెలిసిందే. ఇటువంటి గ్రామాన్ని నిర్లక్ష్యం చేయడం ఆందోళన కలిగించింది. చిన్నకొమ్మెర్ల గ్రామానికి సంబంధించిన వ్యవసాయ పొలాలన్నీ సిమెంట్ కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాలు మొదలుకుని రాళ్లు పడుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. వాయుకాలుష్యంతో ప్రజానీకం సైతం రోగాల బారిన పడి విలలాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహించే సాగునీటి పారుదలశాఖ పరిధిలోని ప్రధాన వాగును సైతం మూసేయడంతో దుగ్గనపల్లి వారాల తరబడి నీటిలో నానడం మొదలుకుని, పంట పొలాలన్నీ ముంపు బారిన పడుతున్నాయి. దశాబ్దాల తరబడి ముంపు బారినపడి నష్టపోయిన పంటలకు ఎటువంటి పరిహారం లెక్కగట్టి చెల్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రధాన వాగును అడ్డగించిన నేరానికి న్యాయ పరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇరిగేషన్ పరిధిలోని చెరువులు, వాగులో తట్టెడు ఇసుక తవ్వితే జరిమానాలు విధించే అధికార యంత్రాంగం ఏకంగా వాగును ఆక్రమించి, మళ్లించిన కార్పొరేట్ కంపెనీపై ఎటువంటి చర్యలు తీసు కుంటుందో సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేక పోతే ప్రభుత్వ చట్టాలు పేదలకు వర్తిస్తాయని, ధనవంతులకు చట్టా లు ఊడిగం చేస్తాయనే నానుడిని నిజం చేసినట్లు అవుతుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

7న చలో కడప కార్పొరేషన్‌ను జయప్రదం చేయండి

- సిపిఎం ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- కడప అర్బన్ :నగర ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న ఉదయం 10 గంటలకు నిర్వ హించే చలో కార్పొరేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. శని వారం రామకృష్ణనగర్, వైఎస్ఆర్ కాలనీ, మృత్యుంజ యకుంట, నాగరాజుపేట, ఎస్టేట్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్ మాట్లాడుతూ కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పాలకులు చెప్పిన మాట లు సామాన్య ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని విమర్శించారు. అభివృద్ధి కేవలం ప్రధాన రోడ్లకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. విలీన పంచాయతీల్లో అభివృద్ధి బూతద్దం పెట్టి వెతికినా కనపడడం లేదన్నారు. నగర శివారు ప్రాం తాలు రోడ్లు, డ్రెయినేజీ, మంచి నీటి సరఫరా, వీధి లైట్లు సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని పేర్కొన్నారు. నగరంలో ఉన్న మృత్యు ంజయకుంట ప్రాంతం చాలా అధ్వానంగా ఉందని, దీని అభివృద్ధి కోసం తక్షణమే అవసరమైన నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. వైఎస్‌నగర్, రామకృష్ణ నగర్, మృత్యుంజయకుంట, ప్రకాష్ నగర్, తిలక్ నగర్, ఆచార్ల కాలనీ ప్రాంతాల సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పర్యటనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు కుమా రస్వామి రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, గోవిందు, సరిత, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, విద్యార్థుల నృత్యాలు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

- రామిరెడ్డి ఫార్మసి కళాశాలలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

ప్రజాశక్తి - కడప

పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. శనివారం ఊటుకూరులోని ప్రకృతి నగర్‌లో గల పి. రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం, ఫేర్వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థులు విద్యనభ్యసించడం తమ అదృష్టంగా భావించాలని అన్నారు. విద్య పూర్తి చేసుకొని పట్టభద్రులుగా బయటకి వెళుతున్న విద్యార్థులందరికీ ఈ సందర్భంగా అభినందన శుభాకాంక్షలు తెలి యజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నెల్సన్ కుమార్ మాట్లాడుతూ 12 బ్యాచ్‌లు ఫార్మ్ డిఎం ఫార్మసీ, 24 బ్యాచ్‌లు బి ఫార్మసీ బయటికి పంపించిన చరిత్ర రామిరెడ్డి ఫార్మసీ కళాశాలది అని తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ జనరల్ మెడిసిన్ డాక్టర్ అవ్వారు అర్జున్, రిటైర్డ్ డిఎంహెచ్ఒ వెంకటరమణ, యాజమాన్యం చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, కరస్పాండెంట్ గౌతంరెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి, ట్రెషరర్ రామచంద్రరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించి ఆకట్టుకున్నాయి.

పట్టాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈనెల 9న అంగరంగ వైభవంగా ఆరోవ బిషప్ సగినాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేక మహోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నామని మేత్రసన వికర్ జనరల్ తలారి బాలరాజు, కోశాధికారి సంబటూరు సురేష్ తెలిపారు. శనివారం మరియాపురం ప్రాంగణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ బిషప్ అరుళయ్య వేదికపై జరుగుతున్న పనులను వారు సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి నాలుగు జిల్లాల మేత్రాసన కాపరిగా సగి నాల పాల్ ప్రకాష్ బిషప్ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయులపై చర్యలేవి? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు

బద్వేలు పట్టణంలో వరుసగా విద్యాసంస్థలలో విద్యార్థినుల జరుగుతున్న వరుస ఘటనలో బాధ్యులపై చర్యలేవి అని డివైఎఫ్ఐ మహిళా జిల్లా కన్వీనర్ గురుదేవి డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులపై జరుగుతున్న వరుస ఘటనలతో విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనపడుతుందన్నారు. లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన సంఘటన మరువక ముందే ఎవిఆర్ స్కూల్ లో మళ్ళీ అదే సంఘటన చోటు చేసుకోవడం బాధాకరమని వాపోయారు. విద్యార్థినిలు పై అసభ్యంగా ప్రవర్తించిన వారి పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యా సంస్థలలో ఇటువంటి వారిని నియమించుకున్న లిటిల్ ఫ్లవర్, ఎవిఆర్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి స్కూల్‌లో విద్యాశాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌లు , అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ తనిఖీలు చేయాలన్నారు. ఎంఇఒ కూడా బాధ్యుడేనని ఆయన్ను సస్పెండ్ చేయాలని పేర్కొన్నారు. అసభ్యంగా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకొని, స్కూలు గుర్తింపులను రద్దుచేయాల, లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మహిళా కో-కన్వీనర్ నాగేశ్వరి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గురుకుల విద్యాపీఠ్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పాత బైపాస్ రోడ్‌లో ఉన్న గురుకుల విద్యాపీఠ్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించారు. సిఇఒ ఎ.ఎల్ వివేకానంద మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. నూతన టెక్నాలజీ అనుగుణంగా విద్యా బోధన కొనసాగిస్తున్నామని చెప్పారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ఉండాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎవిఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఎ.వీరకుమారి, డి.పల్లవి, ప్రిన్సిపల్ ముని చంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, క్యాంపస్ ఇన్చార్జి బాబా ఫక్రుద్దీన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఇఒ ఎ.ఎల్.వివేకానంద

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థికి అభినందనలు

విద్యార్థిని అభినందిస్తున్న ఎం.డి. సంపత్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

అంతర్జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు విద్యార్థి షేక్ అజ్మతుల్లా ఎంపిక కావడం అభినందనీయమని నెక్ట్స్ గ్లోబల్ సర్వీసెస్ ఫుడ్ సేఫ్టీ కన్సల్టెన్సీ ఎం.డి అల్లూరి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎర్రముక్కపల్లిలోని ఎమ్‌డి కార్యాలయంలో క్రీడాకారుని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్మతుల్లా ఫ్లోర్ బాల్ జాతీయ స్థాయిలలో గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు మలేషియాకి వెళుతున్నారని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులు చాలా నిరుపేదలని ఎవరైనా ఆర్థిక సహాయం చేస్తే మరిన్ని పతకాలు సాధిస్తారని జిల్లాకు, రాష్ట్రానికి, మన దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువస్తారని పేర్కొన్నారు. తను ట్రస్ట్ తరపున ఆర్థికంగా సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, కోచ్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మధురైకి బయల్దేరిన సిపిఎం నాయకులు

మధురైకి సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మధురైలో జరుగనున్న సిపిఎం జాతీయ మహాసభలకు ఆ పార్టీ ప్రొద్దుటూరు నాయకులు శనివారం సాయంత్రం మధురై బయల్దేరారు. బస్సును సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం జాతీయ మహాసభలు తమిళనాడులోని మధురైలో ఈనెల 2న ప్రారంభమై 6న ఆదివారం ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలకు ప్రొద్దుటూరు నుంచి సిపిఎం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు బయల్దేరారని తెలిపారు.

బ్రాహ్మణ సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమంపై దృష్టి సారించి లబ్ధి కలిగేలా చూడాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు నూగురు రఘునాథ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు శని వారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం గతంలో సిఎం చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. తద్వారా 2014-19 మధ్య వివిధ పథకాల ద్వారా బ్రాహ్మణులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందన్నారు. వైసిపి నేతలు కూడా బ్రాహ్మణులను పట్టించుకోలేదని విమ ర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.345 కోట్ల కేటా యించడంతో బ్రాహ్మణులకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను వేరు చేసి వివిధ పథకాలు రూపొందించాలని కోరారు. పార్టీ పట్ల, బ్రాహ్మణ సంక్షేమం పట్ల అంకిత భావం ఉన్న పార్టీ నాయకులను కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమిస్తే బ్రాహ్మణులకు మేలు జరుగుతుందని వివరించారు. పార్టీ పదవులలో అవకాశం ఇవ్వాలని సిఎం చంద్రబాబును కోరారు. మండల స్థాయి నుండి బ్రాహ్మణులకు పార్టీ, ప్రభుత్వ పదవుల్లో అవకాశం కల్పించాలని వారు సూచించారు.

'బైరెడ్డి'కి శుభాకాంక్షలు చెబుతున్న రెడ్యం, నాయకులు

బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైన బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి వైసిపి నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నివాసం కడపలో శనివారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చలేక పోతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలొకొచ్చాక వైసిపి శ్రేణులపై దాడులు, హత్య రాజకీయాలు, అక్రమ కేసుల పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. జమిలి ఎన్నికలు రావడం ఖాయమన్నారు. రానున్నది వైసిపి ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాటిమీదపల్లె వార్డు సభ్యులు బత్తిల సుబ్బరాయుడు యాదవ్, రెడ్యం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల వైసిపి పట్టణ ఉపాధ్యక్షుడిగా కిషోర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడిగా 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ కార్యాలయం నుంచి శనివారం నియామక పత్రాలు అందాయి. ఈ సందర్భంగా కిషోర్ మాట్లా డుతూ తనపై నమ్మకం ఉంచిన వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి, వైస్ మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తివంచన లేకుండా పార్టీ కోసం పని చేస్తానని కిషోర్ తెలిపారు. అనంతరం పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు, కిషోర్‌కు అభినందనలు తెలిపారు

అసత్య ఆరోపణలు భావ్యం కాదు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని మిడుతూరులో టిడిపికి చెందిన నాయకులు వైసిపి వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధారమైన ఆరోపణలు చేయడం భావ్యం కాదని, ఇవి తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చని టిడిపి నాయకులు ఇట్టేంశ్రీరాములు యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతియుతంగా ఉన్న గ్రామంలో కక్షలు, గొడవలు సృష్టించవద్దని సూచించారు. గత వైసిపి ప్రభుత్వంలో కుల్లాయమ్మ, జింకా అరుణ్‌కుమారు ప్రభుత్వ భూమిని పొందారన్నారు. వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటున్నారని, వారికి ఏ మాత్రం అర్హత లేదన్నారు. టిడిపి నాయకులు ఎవరూ బెదిరింపులకు పాల్పడలేదన్నారు. అలాంటి అవసరం తనకు లేదన్నారు. టిడిపి శ్రేణుల ఎవరూ జోక్యం చేసుకోకుండా జింకా కుటుంబ సభ్యులే న్యాయస్థానానికి వెళ్లారని, న్యాయస్థానం సూచనల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు విచారణ చేపట్టారని, ఆ మేరకే చర్యలు ఉంటాయన్నారు. టిడిపి శ్రేణులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని అణగదొక్కాలనే కుట్రతోనే వక్ఫ్ బిల్లును ప్రవేశ పెట్టారన్నారు. రాజ్యాంగాన్ని శాసనాలను అనుసరించి ప్రజలకు న్యాయం చేస్తానని ప్రమాణం చేసిన నాయకులు అందుకు విరుద్ధంగా చట్టాలు తీసుకు రావడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ ముస్లిం సమాజాన్ని మోసం చేసిందని విమర్శించారు. టిడిపి చేసిన ఈ మోసాన్ని ముస్లిం ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. ఇప్పుడు స్పందించకపోతే భవిష్యత్ తరాలను మోసం చేసిన వాళ్లమవుతామన్నారు. ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకునేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ బిల్లును సమర్ధించిన పార్టీలకు రాబోయే ప్రతి ఎన్నికల్లో ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులచే కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కెసి కాలువలో ఆగిన నీరు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువకు సాగునీరు నిలిచిపోయింది. ఈ ఏడాది మార్చి 30 వరకు నీటిని విడుదల చేశారు. అధికారులు ముందుగా ఏలాంటి ప్రకటన లేకుండా ఏప్రిల్ మొదటి వారం వరకు నీరు విడుదల చేశారు. మే మొదటి వారం వరకు కెసి కాలువకు నీరు వస్తే చాలా వరకు పంటలు పూర్తి అవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పూర్తయిన తర్వాత రెండవ దఫా వరి, మినుము, నువ్వు, మొక్కజొన్న వంటి పంటలు రైతులు సాగు చేపట్టారు. ప్రస్తుతం పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. పంటలు పూర్తి కాకుండానే కెసి కాలువకు అధికారులు నీటిని నిలిపివేశారు. గత ఖరీఫ్‌లో ఆగస్టు మొదటి వారంలో కెసికి నీటిని విడుదల చేశారు. అప్పటి నుండి ప్రస్తుతం వరకు నీరు ఆకుకుండా విడుదల చేశారు. ఈ ఏడాది రబీలో కెసి కెనాల్ పరిధిలో సాగైన పంటలు నూర్పిడి పూర్తి కాకుండానే నీటిని నిలుపుదల చేస్తే సాగైన పంటల పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు తడులు వస్తే పంటలు పూర్తి అవుతాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పసుపు పంటను రైతులు నూర్పిడి చేస్తున్నారు.

అధునాతన సాంకేతిక విద్యకు శ్రీకారం

మాట్లాడుతున్న డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన పద్ధతిని అమలు చేస్తున్నామని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో శనివారం కరస్పాండెంట్ బైరెడ్డి దీప్తి నిఖిలారెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా, శారీరక శ్రమను తగ్గించేందుకు తాము ప్రవేశపెట్టబోయే కరికులం ఉపయోగ పడుతుందన్నారు. లీడ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా జమ్మలమడుగులో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల నైపుణ్యంతో పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను మరింత బయటికి తీయుటకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సంపూర్ణ అభ్యసన పద్ధతుల వల్ల విద్యార్థులు అర్థం చేసుకొని భవిష్యత్‌లో మర్చిపోకుండా ఉంటారన్నారు. లీడ్ ప్రోగ్రామర్ నిశాంత్ తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పారు. విద్యార్థి ఒకటిన్నర విద్యా సంవత్సరంలో ఎంత జ్ఞానాన్ని పొందుతారో అంత జ్ఞానాన్ని ఒక ఏడాదిలోనే పొందుతారని తెలిపారు. ఎఐ ప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యమిత్ర, ప్రిన్సిపల్ శిరీష, భరత్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసీం, ప్రసాద్, హృషి, సంపూర్ణ, నాగవేణి, పాల్గొన్నారు.

ఆధార్ సేవలకు బ్రేక్

ముద్దనూరు : పలు రకాల సేవలకు వినియోగించుకునేందుకు అవసరమైన ఆధార్ కార్డు పొందేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో రెండు చోట్ల ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ముద్దనూరు, కొర్రపాడులో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఆధార్ సేవలు అందించే డిజిటల్ అసిస్టెంట్లు అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. వారం రోజుల వరకు ఆధార్ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. దీనిపై ఎంపిడిఒ ముకుందారెడ్డిని వివరణ కోరగా..ఆధార్ సేవలకు అంతరాయం లేకుండా సేవలు కొనసాగిస్తామన్నారు. పెనికలపాడు-2 డిజిటల్ అసిస్టెంట్‌కు ముద్దనూరు సచివాలయం-2కు ఆధార్ సేవలు చేసేందుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొర్రపాడు సచివాలయం ఆధార్ కేంద్రాన్ని యామవరం సచివాలయానికి మార్చనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డిఎస్‌పి భవానీ

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - చాపాడు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రైనీ డిఎస్‌పి భవానీ సూచించారు. చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడవచ్చన్నారు. లైసెన్స్ ఉన్నవారు మాత్రమే వాహనాలు నడపాలని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలు నడిపే అవకాశం ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిఐ దస్తగిరి సూచించారు. స్థానిక పాత బస్టాండులో శనివారం సిఐ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్, ఆర్‌సి కలిగి ఉండాలన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి ఆటోలు నడిపితే శిక్షార్హులు అవుతారని సూచించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కిం చుకోకూడదన్నారు. ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ దస్తగిరి

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

సామాజిక వివక్షతను జయించిన సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. .శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలు కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షతను నిర్మూలించడంలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం 'సమతా దివస్' గా నిర్వహించుకుంటున్నామన్నారు. జాతీయ భద్రత, ఆహార భద్రత నెలకొల్పడంలో ఆయన పాత్ర వెలకట్టలేని దన్నారు. విలువలతో కూడిన ఆయన జీవితం మన అందరికీ ఆదర్శనీయమని.. ఆయన అడుగు జాడల్లో నేటి యువత నడవాలని కోరారు. ముందుగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాకు చెందిన పలువురు దళిత సంఘాల నేతలు బాబు జగ్జీవన్ రామ్ సేవలను కొని యాడారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఒ విశ్వే శ్వర నాయుడు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ అనితా దీప్తి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, సాంఘిక సంక్షేమ శాఖాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మామిళ్ళ బాబు, షేక్ నీలం, ముబారక్ బాషా, రఫీక్ ఖాన్, కమల్ బాష, సంజయ్ కాంత, సిరాజుద్దీన్, శ్యామలమ్మ, మల్లెం విజయ్ భాస్కర్, శీలం గంగయ్య, వెంకట రమణారెడ్డి, అలెక్స్ సురేష్, సయ్యద్ గౌస్ పీర్, హమీద్, పాలెం హరిప్రసాద్, కదిరి ప్రసాద్ గౌడ్, ఆసిఫ్ ఖాన్, లక్ష్మీకాంత, గద్దె సునీత, శ్రీనివాసరెడ్డి, జహ్వార్, దినకర్ రెడ్డి, నాసిర్ ఖాన్, సిద్ధి క్ పాల్గొన్నారు **వైసిపి జిల్లా కార్యాలయంలో...** వైసిపి నాయకులు, మేయర్ సురేష్ బాబు, జల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ మాజీ సిఎం అంజాద్‌బాషా ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి, నగరంలోని మహవీర్ సర్కిల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ గారి విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్ ఛార్జులు, అనుబంధ సంఘాల నాయకులు, వైసిపి నాయ కులు పాల్గొన్నారు. **ఆర్ట్స్ కళాశాలలో..** ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్ర నాథ్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ రమేష్ యాదవ్, అధ్యాపకులు జమాల్‌బాషా, సందరేశ్వర రావు, సిసీ అసిస్టెంట్ ప్రసాద్, శారద, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

కెవిపిఎస్ ఆధ్వర్యంలో..

కడప అర్బన్ : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కడప రామకృష్ణ నగర్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలో అంట రానితనం, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడు జగ్జీవన్ రామ్ అన్నారు. స్వాతంత్ర్యం అనం తరం సమానత్వం, సామాజిక న్యాయం, హక్కుల కోసం అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను అందరం కలిసి ముందుకు తీసుకు పోవాల న్నారు. కెవిపిఎస్ సీనియర్ నాయ కులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా నాయకులు జార్జి శేఖర్ స్థానిక నాయకులు రమణ, ప్రవీణ్, శ్రీను, వెంకటసుబ్బయ్య, గోవింద్,భాస్కర్,గంగాధర్, అంజి, శివ,బాలు,రవి, జన విజ్ఞాన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. **యుటిఎఫ్ ఆధ్వర్యంలో..** నేటి సమాజానికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ దార్శని కుడని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం కడప మున్సిపల్ కార్పొరేషన్ (మెయిన్)హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్ష మూల్యాంకన కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహమ్మద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రూతు ఆరోగ్యమేరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గోపినాథ్, బి.చంద్రశేఖర్, కేదార్నాథ్, ఎ.డి.దేవదత్తం, ప్రకాశ్ బాబు, పవన్‌కుమార్, రవి, రాయుడు పాల్గొన్నారు. **జిల్లా పోలీస్ కార్యాలయంలో..** ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి. రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి కె.శ్రీనివాస రావు, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, టైటాస్, శివరాముడు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో .. జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కడప జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ సామాన్య స్థాయి నుంచి ఉప ప్రధానమంత్రి వరకు ఆయన ఎదిగిన క్రమం స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. దేశ అభివృద్ధిలో, సమస్యల పరిష్కారంలో ఆయన పాత్ర ఎంతో ఉన్నతమైనదని కొనియాడారు. ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున, విజయకుమార్ (యుటిఎఫ్), అంకాల్ కొండయ్య, గంగాధర్ (ఎస్ఎల్‌టిఎ), అబ్దుల్లా (ఎపిటిఎఫ్) చంద్రశేఖర్ (ఎస్ఆర్‌టిఎఫ్), ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘ నాయకులు గంగరాజు , ప్రేమ సాగర్, జయ రాముడు, రాజబాబు, దేవ దత్తం (జన విజ్ఞాన వేదిక), మేరీ (ప్రధానో పాధ్యాయురాలు), బాదుల్లా (సూపరింటెండెంట్), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేంపల్లె : భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక

జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి, మండలశాఖల అధ్యక్షులు బీగాల రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా (మాస్), డాక్టర్ సుబ్రమణ్యం, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బద్రి, వేమారాజా, నాగరాజు, రమణ, వేమయ్య, గంగోజి పాల్గొన్నారు. అంబేద్కర్ సేవా సమితి చైర్మన్ బందేల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఓబులేసు, నాగన్న ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ 118వ జయంతిని ఘనంగా నిర్వ హించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి దళిత సంఘాల నాయకులు, వైసిపి, టిడిపి, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల కన్వీనర్ వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, యుగంధర్, వైసిపి నేత కమతం రాజా, వే వ౦౦ ల

కాంగ్రెస్ మండల కన్వీనర్ వెంకటేష్, కేశవ దేవదాసు, గొంగటి శేఖర్, రఫీ, అల్లాబకష్, దర్బార్, తంగే దుపల్లె రాజా, దళిత, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

ఖాజీపేట : స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టెం శ్రీరాములు యాదవ్, మైదుకూరు నియోజకవర్గం బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, లక్కు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆహార విజ్ఞాన కేంద్ర, సాంకే తిక కళాశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం నిర్వ హిం చారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్.మాధవ, అధ్యాపకులు, విద్యార్థులు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ నివేదిత, అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయిశ్రీనివాస్, డాక్టర్ జాకీర్‌బాషా, ఎన్‌వి సుబ్బారెడ్డి, పీడీ డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరులో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని దళిత, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు అధికారులను కోరారు. రాజీవ్ సర్కిల్‌లోని ప్రజాసంఘాల కార్యాలయ ఆవరణలో జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి దళిత సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఎల్లయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు (బ్రహ్మయ్య మాదిగ గ్రూపు) గడ్డం నరసింహులు మాదిగ, విద్యార్థి సంఘ నాయకులు కత్తి ఓబులేసు, తోళ్ల జగన్, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి, బయన్న, లింగమయ్య, దాసు, నరసింహ శ్రీను పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : జగజ్జీవన్‌రామ్ జయంతిని శనివారం వైసిపి కార్యా లయంలో ఘనంగా నిర్వహిం చారు. ఎ ా ఎ న ాా మనోహర్‌రెడ్డి, రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్ర పురెడ్డి సురేంద్రరెడ్డి, విభాగ అధ్యక్షులు మారుతి మోహన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వీరారెడ్డి, రంగాపురం మధురెడ్డి, గంగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో..

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

ఎర్రగుంట్ల : విద్యుత్ పనులు చేసే సమయంలో నిర్లక్ష్యం వీడి, సంస్థ సూచించే నియమాలను పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట రమణారెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ఎస్‌వి కల్యాణమండపంలో శని వారం విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి అధికారులు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ ప్రజలు తమంతటతాము విద్యుత్ పనులు సొంతంగా చేసుకోకుండా, తమ సంస్థ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలంలో ప్రజలకు అంతరాయం లేని విద్యుత్తును అందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. అందుకోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎర్రగుంట్ల సబ్ డివిజన్ పరిధిలో ప్రతిభావంతులైన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎడి కిరణ్ కుమార్, ఎఎఒ సుధాకర్, పట్టణ ఎఇ ప్రియదర్శన్ రెడ్డి, రూరల్ ఎఇ చంద్రశేఖర్, కమలాపురం ఎఇ చాంద్‌బాషా, విఎన్ పల్లి ఎఇ హరిప్రసాద్ రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప

O.S.No. 398/2024

Balaraju Venkata Sesham Raju @ B.V. Sesham Raju, S/o. B. Lakshmana Raju, Hindu, aged 48 Years, Business, resident of D.No.7/565-1, N.G.O. Colony, Chinnachowk, Kadapa City. **...Plaintiff**

Vs

Y. Yadagiri Raju, S/o. Y. Venkata Raju, Hindu, aged 54 Years, Business, resident of D.No. 10/3-B, Yeguva Kummarapalli Village, Patur Post, Nandalur Mandal, Kadapa District (Now Annamaiah District) - 516150. **...Defendant**

ప్రతివాదికి దావా సమను

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై కేసు మీ హాజరు కొరకు 21.04.2025వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

కె. విజయ్ క్రిష్ణ.,B.A., LL.B.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9959887870.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 51/2024

ధారా పౌల్, తండ్రి దారా సామ్యూల్, వయసు 61 సంవత్సరాలు, క్రిస్టియన్, రిటైర్డ్ ప్రయివేట్ ఉద్యోగి, పూర్వ నివాసం బూబుసాని పల్లె, గ్రామం, మైలవరం మండలం, కడపజిల్లా. ప్రస్తుత నివాసం డోర్ నెంబర్ 21/1/384, సొసైటీ కాలనీ, కన్నెలూరు, జమ్మలమడుగు టౌన్ మరియు మండలం, వైఎస్సార్ కడప జిల్లా. **...వాది**

వర్సెస్

ఏకాశి ఓబులేసు, తండ్రి ఓబులేసు, వయసు 54 సంవత్సరాలు, ఉద్యోగి, రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు, ఎపి జెన్‌కో, నివాసం, పోలీస్ లైన్, ఎర్రగుంట్ల గ్రామం మరియు మండలం, ఆర్.టి.పి.పి, డోర్ నెం. ఎఫ్.200, వైఎస్సార్ కడప జిల్లా. **...ప్రతివాది**

దావా సమను

పైన పేర్కొన్న వాది, ప్రతివాది అయిన మీరు ఇవ్వవలసిన ప్రోనోటు బాపతు బాకీ సంబంధించి డిక్రీ కోరుతూ మీపైన దాఖలు చేసిన దావా మీ హాజరు కొరకు పైకోర్టులో 19.04.2025న వాయిదా ఉన్నది. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఆతేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతటా మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 19.04.2025

//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

సి. సుబ్బారెడ్డి,
వాది తరపు అడ్వకేట్, జమ్మలమడుగు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప

O.S.No. 658/2024

Canara Bank (erstwhile Syndicate Bank), Represented by its Manager, Main Branch-II, Kadapa. **...వాది**

Vs

1. Gante Indira, W/o. G. Venkata Subbaiah, Hindu, age 41 Years, Rice business, resident of D.No. D.No. 38/330, Rama Krishna Nagar, Chinnachowk, Kadapa City, Kadapa District, Mob: 9652847780.
2. Onteru Venkatesu, S/o. Late Onteru Ramaiah, Hindu, age 47 Years, Business, resident of D.No. 2/219-3, Sastry Nagar, Akkayapalli, Kadapa City, Kadapa District.

...ప్రతివాది నెంబరు 1 మరియు 2

ప్రతివాదులకు సమన్లు

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు 22.04.2025వ తేదీన ఉదయం గం. 10.30ని.లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

కె. వెంకట సుబ్బయ్య,B.A., B.L.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9704890225.